క్లుప్తంగా

ఉపాధి కూలీలకు బీమా



మాట్లాడుతున్న ఏపీవో శ్రీనివాసు

వి.ఆర్.పురం: కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను ప్రతి ఒక్క ఉపాధి కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా బీమా చేయించుకోవాలన్నారు. ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగితే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు.

మారెమ్మ అమ్మవారి పండగకు ప్రత్యేక బస్సు సర్వీసులు

సీలేరు: సీలేరు గ్రామ దేవత మారెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతుంది. మారెమ్మ తల్లి ఉత్సవాలు ఈ నెల 14 నుంచి జరుగుతున్న విషయం తెలిసిందే. వేడుకల్లో భాగంగా 27న అమ్మవారి ప్రధాన పండుగ నేపథ్యంలో భక్తుల కోసం ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. విశాఖపట్నం నుంచి సీలేరు, సీలేరు నుంచి విశాఖపట్నం వరకు రిజర్వేషన్ సదుపాయం కల్పించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు విశాఖలో 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి సీలేరు రాత్రి 10 గంటలకు చేరుకుంటుందని అదే బస్సు తిరిగి 28న ఉదయం 5 గంటలకు బయలుదేరుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

తాగునీటి పథకాలు ప్రారంభం



ఏబులంలో తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శివరత్నం, సర్పంచ్ బొబ్బిలి లక్ష్మిలు

గూడెంకొత్తవీధి: జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన తాగునీటి పథకాలను బుధవారం మండలంలోని ఏబులం గ్రామంలోని నూకాలమ్మ వీధిలో జెడ్పీటీసీ కిముడు శివరత్నం ప్రారంభించారు.సర్పంచ్ బొబ్బిలి లక్ష్మితో కలసి ఈ పథకాలను ప్రారంభించారు. గిరిజన గ్రామా ల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు వారు తెలిపారు.

దివ్యాంగుల ప్రత్యేక శిబిరం



శిబిరంలో వివరాలు నమోదు చేయించుకుంటున్న దివ్యాంగులు

అడ్డతీగల: అడ్డతీగల మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం అల్మికో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఉపకరణాల గుర్తింపుతో పాటు ఆసక్తి కలిగిన దివ్యాంగులకు వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ కోసం ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల నుంచి పలువురు దివ్యాంగులు శిబిరానికి తరలివచ్చి అవసరమైన ఉపకరణాల కోసం వివరాలు నమోదు చేయించుకున్నారు. ఎంపీడీవో కె.ఆర్. విజయ, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



రంపచోడవరంలో కొవ్వొత్తుల ర్యాలీ

రంపచోడవరం: జమ్మూకాశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం రంపచోడవరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకుడు కారం సీతారామన్నదొర (ఢిల్లీబాబు) ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతులకు నివాళులర్పించారు. నాయకులు బొజ్జిరెడ్డి, బుల్లికొండలదొర, లక్ష్మి, రామారెడ్డి, నాగవీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీష, మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

రంపచోడవరం: మండలంలోని పెద్దకొండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పల్లాల సోమిరెడ్డి కుమారుడు పల్లాల బాబురావురెడ్డి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బుధవారం ఎమ్మెల్యే శిరీషదేవి, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు బాపిరాజు, చెల్లన్నదొర, రవిబాబు, కొండబాబు తదితరులున్నారు.

నిరాశపరిచిన ‘పది’ ఫలితాలు

అరకులోయటౌన్: జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు నిరాశ కలిగించాయి. గతేడాది కంటే తక్కువగా ఫలితాలు నమోదయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన సంక్షేమ పాఠశాలలు, కేజీబీవీల్లో ‘పది’ పరీక్షల ఉత్తీర్ణత శాతం అట్టడుగు స్థానాల్లో నిలిచాయి. అరకులోయ మండలంలోని ఏపీ గిరిజన సంక్షేమ పాఠశాలల్లో–76 ఉత్తీర్ణత శాతం, ఏపీటీడబ్ల్యూఆర్ స్పోర్ట్స్ పాఠశాలలో 68 శాతం, ఏపీటీడబ్ల్యూజీహెచ్ఎస్ పాఠశాలలో–56 శాతం, కేజీబీవీలో–38 ఉత్తీర్ణత శాతం నమోదైనట్టు నమోదైనట్టు అధికారులు తెలిపారు.

ముంచంగిపుట్టు: మండలంలోని 15 పాఠశాలల నుంచి 448 మంది పరీక్షలు రాయగా 140 మంది విద్యార్థులు పాసుకాగా, 31.25 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు. మండల టాపర్‌గా కిముడు తానుశ్రీ (480)నిలిచింది.

డుంబ్రిగుడ: మండలంలో 573 మంది పరీక్షలు రాయగా 140 మంది విద్యార్థులు పాసుకాగా, 18 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు. మండల టాపర్‌గా జి.ప్రీతి(509) నిలిచింది.

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని గుమ్మకోట ఏపీఆర్ విద్యార్థి టి.భరత్ (471) టాపర్‌గా నిలిచాడు.

హుకుంపేట: మండలంలో 644 మంది పరీక్ష రాయగా, 167 మంది పాసుకాగా 26 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు. మండల టాపర్‌గా ఎస్.త్రిభువనేశ్వరి (466) టాపర్‌గా నిలిచింది.

పెదబయలు: మండలంలోని 14 పాఠశాలల నుంచి 632 మంది పరీక్ష రాయగా, 304 మంది పాసుకాగా, 48.10 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు. మండల టాపర్‌గా ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఆశ లిల్లీ(555), ప్రభుత్వ పాఠశాలకు చెందిన కోడ పరమేష్(481) నిలిచారు.

కొయ్యూరు: పదో తరగతి ఫలితాల్లో మండలంలో 91 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు. మండల టాపర్‌గా ఎల్.ఎల్.ప్రతాప్(554) నిలిచాడు.

గూడెంకొత్తవీధి: మండలంలోని దారుకొండ, జర్రెలలో సున్నా ఫలితాలు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

చింతపల్లి: మండలంలో 662 మంది పరీక్ష రాయగా 125 మంది ఉత్తీర్ణత సాధించినట్టు అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉల్లి గ్రేసి (528), ప్రైవేట్ పాఠశాల నుంచి బి.జానకి రామరాజు (578) సాధించి టాపర్లుగా నిలిచారు.

సీలేరు : సీలేరు పరీక్షా కేంద్రంలో మొత్తం 157 మంది పరీక్ష రాయగా, 133 మంది ఫెయిలైనట్టు అధికారులు తెలిపారు.

రాజవొమ్మంగి: మండలంలోని 92.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు అధికారులు తెలిపారు. మండల టాపర్‌గా కుడుముల సబిత (550) నిలిచింది. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్టు అధికారులు పేర్కొన్నారు.

చింతూరు: మండలంలోని 41.68 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు. మండల టాపర్‌గా గౌర్రె సంతోష్ (565) నిలిచాడు.

అడ్డతీగల: మండలంలోని 9 పాఠశాలల నుంచి 363 మంది పరీక్ష రాయగా 330 మంది పాసుకాగా, 90శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు.

మండల టాపర్లుగా యాట్ల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి (576), బి.రామ్‌చరణ్ (566) నిలిచారు.

వై.రామవరం: మండలంలో 281 మందికి 210 మంది పాసుకాగా, 74శాతం ఉత్తీర్ణత సాధించినట్టు అధికారులు తెలిపారు. మండల టాపర్‌గా డొక్క సుమిత్రదేవి(536)నిలచింది.

ఎటపాక: మండలంలో 268 మంది పరీక్ష రాయగా 161 మంది పాసు కాగా, 60 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు. మండల టాపర్‌గా లాస్యంత్ (582) నిలిచాడు.

వి.ఆర్.పురం: మండలంలోని పది పరీక్ష ఫలితాల్లో 77 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు. మండల టాపర్‌గా పిట్ట నాగలక్ష్మి (543) నిలిచింది.

కూనవరం: మండలంలోని 8 పాఠశాలల నుంచి 344 మంది పరీక్ష రాయగా, 198 మంది పాసుకాగా 57 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు. గొమ్ముగూడెం గ్రామంలోని మాంటిసోరీ హైస్కూల్‌కు చెందిన అరవా మాధవి (590)మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. మండలంలోని ఏసుపాక వరుణకుమార్ (532) మార్కులతో రెండో స్థానంలో నిలిచాడు.



సంతోష్ (565)



దివ్య తేజశ్రీ (563)



ప్రతాప్ (554)



ఆశా లిల్లీ (555)



సబిత (550)



సాయిప్రదీప్ (550)



అజయ్(550)



నిహార (545)



నాగలక్ష్మి (543)



యువకిరణ్ (537)



సుమిత్రదేవి (536)



వరుణకుమార్ (532)



గ్రేసి (528)



తానుశ్రీ (480)



గంగవరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్ తదితరులు

గంగవరం: మండలంలోని పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 67 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు. మండల టాపర్‌గా సాయిగగన్(506) నిలిచాడు.

రంపచోడవరం/మోతుగూడెం: రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల్లో 4788 మంది విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించినట్టు గిరిజన సంక్షేమశాఖ డీడీ రుక్మాండయ్య, ఏజెనీస డీఈఓ వై మల్లేశ్వరరావులు తెలిపారు.ఏజెన్సీ 11 మండలాల్లోని గిరిజన సంక్షేమ, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల నుంచి 6730 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 4788 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. మోతుగూడెం డీఏవీ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు జి అజయ్ 550 మార్కులు, కె యువకిరణ్ 537 మార్కులు, నిహార 545 మార్కులు సాధించారు. ఇందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మట్ట సాయిప్రదీప్ 550 మార్కులు సాధించారు.లెనోరా పబ్లిక్ స్కూల్ విద్యార్థిని బత్తుల శ్రావ్యదర్శి 555 మార్కులు సాధించారు. దేవీపటన్నంలో 51 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 23 మంది ఉత్తీర్ణత సాధించినట్టు అధికారులు తెలిపారు.

కలెక్టర్‌కు నిర్వాసితుల వినతి

వి.ఆర్.పురం: వడ్డుగూడెం, వీఆర్‌పురంలోని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన గిరిజనేతరులు కోరుకొండ, గోకవరం, తిరువూరు పరిసర ప్రాంతాల్లో పునరావాసం కల్పించాలని కలెక్టర్‌ను గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. వడ్డుగూడెం, వి.ఆర్.పురం రెండు గ్రామాల్లో సుమారు 2000 నిర్వాసితులుండగా 1200 మందిని మాత్రమే జాబితాలో పేర్కొన్నారని, మిగిలిన వారిని జాబితాలో చేర్చాలని వినతిలో కోరారు. గిరిజనేతరులకు సరైన ప్రాంతాల్లో పునరావాసంతో పాటు అన్ని సదుపాయాలు కల్పించాలని, ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఇళ్ల నష్టపరిహారంగా రూ.15లక్షల ఇవ్వాలని విన్నవించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బి.సత్యనారాయణ, బి.నరసింహరావు. జి.శ్రీనివాసు, కె.రమేష్, బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

ఆత్మీయ సత్కారం


వై.రామవరం: మండలం నుంచి బదిలీపై వెళ్తున్న ఆరుగురు పంచాయతీ కార్యదర్శులకు వీడ్కోలు పలుకుతు, మండలంలో కొత్తగా విధుల్లో చేరిన 10 మంది కార్యదర్శులకు స్వాగతం పలుకుతు బుధవారం ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కారాలయంలో సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ళ సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు కర్ర వెంకయమ్మ, ముత్యాల నరసింహమూర్తి, జర్త కృష్ణమూర్తి, రోలిపల్లి నరశింహమూర్తి తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతు బదిలీపై వెలుతున్న కార్యదర్శులు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం వారికి శాలువా కప్పి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన వారందరికి విందు ఏర్పాటు చేశారు. ఈఓపీఆర్డీ డి.శివకుమర్, ఏపీఓలు సాయిబాబ, స్వామి, ఎంఈవో కె.తాతబ్బాయిదొర, సిబ్బంది, నాయకులు కనకరాజు, బ్బాయిరెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న అధికారులు తదితరులు

గ్రామాల్లో దోమల మందు స్ప్రేయింగ్

ఎటపాక: మండలంలోని నెల్లిపాక, గౌరిదేవిపేట పీహెచ్‌సీల పరిధిలో బుధవారం దోమల మందు పిచికారీ చేయించారు. మురుమూరు పంచాయతీ పరిధిలోని కామన్‌తోగు, నెల్లిపాక పంచాయతీలోని ఎర్రగుంట గ్రామాల్లో స్ప్రేయింగ్ చేయించి పరిసరాలు పరిశుభ్రతపై అధికారులు అవగాహన కల్పించారు. దోమల నియంత్రణకు ప్రతీ ఇంట్లో, పరిసరాల్లో దోమల మందు పిచికారీ చేయాలని అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమల వలన మలేరియా, విషజ్వరాలు ప్రబలుతాయని తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వైద్యులు శ్రీదేవి, విష్ణుప్రియ, ఏఎంఓ శ్రీనివాసరాజు, సర్పంచ్ మణి, హెచ్‌వీలు, వాణి, సీతమ్మ, ఏఎన్ఎంలు భవాణి, మహిళా పోలీస్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.



కామన్‌తోగులో స్ప్రేయింగ్ పర్యవేక్షిస్తున్న వైద్యురాలు శ్రీదేవి

కనులపండువగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

యలమంచిలి రూరల్: మండలంలోని ములకలాపల్లి మైహోమ్ సిమెంట్ పరిశ్రమలో నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ప్రతి ఏటా ఇక్కడ పరిశ్రమ క్వార్టర్స్‌లో ఉన్న వ్యూహ లక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఈ నెల 20 నుంచి శాస్త్రోక్తంగా వేడుకలు జరిపారు.

చివరి రోజు స్వామివారికి చక్రస్నానం వేద మంతోచ్చారణల మధ్య పూర్తి చేశారు. ముందుగా వెంకన్నకు 108 కలశాలతో మైహోమ్ గ్రూప్ సంస్థల అధినేత జూపల్లి రామేశ్వరరావు దంపతులు అభిషేకం నిర్వహించారు. కర్మాగారం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



వెంకన్నకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదు

ఎస్.రాయవరం: ప్రభుత్వ భూములు, గోర్జిలు, చెరువు గట్లను ఆక్రమిస్తే సహించేది లేదని తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ హెచ్చరించారు. గ్రామంలోని చెరువు గట్టు ఆక్రమణపై జల వనరుల శాఖ అధికారులకు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 41లోని సుమారు 7.12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు సుమారు 100 ఏళ్లకు పైగా ఆయకట్టు రైతులకు సాగు నీరందిస్తోందని, అటువంటి చెరువుని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇప్పటికే రెండు దఫాలు ఆక్రమించి చెరువు గర్భం పాడు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నంబర్లు 8, 15, 23, 26, 30 గల గోర్జి ద్వారా చెరువుకు నీరు వచ్చేదని, ఇప్పుడు అది కూడా ఆక్రమణలకు గురకావస్తోందని చెప్పారు. ఆక్రమణల్లో భాగంగా మట్టి తవ్వినప్పుడు పొలాలు లోతట్టు ప్రాంతాలుగా మారడంతో ముంపునకు గురవుతున్నాయన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వ ఫిర్యాదు చేస్తున్నట్టు చెప్పారు. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి రైతుల సాగుయోగ్యాన్ని కాపాడాలని సర్పంచ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

ముంచంగిపుట్టు: జేజేఎం ద్వారా జరుగుతున్న తాగునీటి పనులు సక్రమంగా జరగడం లేదని ఎంపీపీ సీతమ్మతో పాటు సభ్యులు తదితరులు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది.ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజేష్ నీటి పనులపై వివరిస్తూ ఉండగా సభ్యులు జేజేఎం నీటి పనులపై ప్రశలు కురిపించారు. జేజేఎం నీటి పథకాలు మంజూరు తప్ప గ్రామ స్థాయిలో నీటి పనులు పూర్తి కావడం లేదన్నారు. ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయని, వేసవిలో తాగునీటి కోసం గ్రామాల్లో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఎంపీపీ సీతమ్మతో పాటు సభ్యులు సూచించారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో వైద్య సేవలపై సూపరింటెండెంట్ గీతాంజలిని సభ్యులు నిలదీశారు. విద్యాశాఖ, హౌసింగ్, ఎన్ఆర్ఈజీఎస్ శాఖలపై అధికారులు, సభ్యుల మధ్య వాదనలు జరిగాయి. జీవో నెంబర్–3 ను కొనసాగించాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తీర్మానం చేసి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. అభివృద్ధి పనులపై సర్పంచులు,ఎంపీటీసీలకు సమాచారం అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి, ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఏటీడబ్ల్యూవో స్వర్ణలత, ఎంఈవో కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో సర్వసభ్య సమావేశం

గూడెంకొత్తవీధి: చాలాకాలంగా పోడు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న గిరిజనులకు అటవీ హక్కుల చట్టం కింద వారికి పట్టాలు మంజూరు చేయాలని గూడెంకొత్తవీధి ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో ఉమామహేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలను లేవనెత్తారు. గత సమావేశంలో సభ్యులు విన్నవించిన సమస్యల్లో ఎన్నింటిని అధికారులు పరిష్కరించారని ఎంపీపీ అధికారులను అడిగారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. జెడ్పీటీసీ శివరత్నం మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా నిర్వహించడం వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. తహసీల్దార్ రామకృష్ణ రెవెన్యూ పరంగా చేపట్టిన పనులను వివరించారు. పరిపాలనాధికారి ఇమ్మానుయేల్, ఈవోపీఆర్డీ పాపారావు, వైస్ ఎంపీపీ ఆనంద్, దేముడు తదితరులు పాల్గొన్నారు.



జీకేవీధిలోని సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుమారి

పాఠశాలకు ఐరన్‌గేటు వితరణ



చౌడుపల్లి పాఠశాలకు ఐరన్‌గేటును వితరణగా ఇస్తున్న చింతపల్లి హెచ్‌ఎం రామరాజుపడాల్

చింతపల్లి: మండలంలో చౌడుపల్లి పాఠశాలకు ఐరన్‌గేటును చింతపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సాగిన రామరాజుపడాల్ వితరణ ఇచ్చారు. పాఠశాలకు గేటు లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సెలవులు నేపథ్యంలో ఆకతాయిలు, పశువులు పాఠశాలలోనికి వచ్చి పరిసరాలను పాడుచేసే అవకాశం ఉందన్నారు. దీంతో చింతపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సాగిన రామరాజుపడాల్ తమ సొంత నిదులతో సమకూర్చిన ఐరన్‌గేటును బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులకు అందజేశారు. హెచ్‌ఎం కుడుముల కాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

మాడుగుల రూరల్ : ఎం.కోడూరులో మరిడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం రూ.25వేల నగదును సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ఆధ్వర్యంలో పడాల కొండలరావు దంపతులు అందించారు.ఉప సర్పంచ్ రాజేష్‌కుమార్, ఎంపీటీసీ రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

పాడేరు రూరల్: శ్రీచైతన్య, నారాయణ తదితర కార్పొరేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, అధ్యక్షుడు కృష్ణలు డిమాండ్ చేశారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతు శ్రీచైతన్య, నారాయణ కార్పొరేట్ విద్య సంస్థలు తప్పుడు ర్యాంకులతో విద్యార్థులను మోసం చేస్తున్నాయని, జెఈఈలో కూడా అదే తంతుగా మోసపూరితమైన ర్యాంకులు చూపించి ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఒక్కే విద్యార్థికి రెండు విద్యా సంస్థల నుంచి ఏ విధంగా ర్యాంకులు వస్తాయని ప్రశ్నించారు. ఇటువంటి మోసపూరిత ప్రకటనలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.మోసపూరిత దొంగ ప్రకటనలు చేయాడం సిగ్గు చేటన్నారు. ఆయా విద్యా సంస్థలపై క్రమ శిక్షణ చర్యలు తక్షణం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు రాజశేఖర్,కృష్ణ

అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట



శివలింగం



సత్యనారాయణ స్వామి



లక్ష్మిదేవి



షిర్డీసాయిబాబా

సాక్షి,పాడేరు: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం పలు దేవతా మూర్తులను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. శివలింగం, సత్యనారాయణస్వామి, లక్ష్మీదేవి, షిర్డీసాయి బాబా విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ కొట్టగుళ్లి సుబ్బారావు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉప సర్పంచ్ రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహం ప్రతిష్ట



సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన డీడీ రజని

డుంబ్రిగుడ: చదువుల తల్లి సరస్వతి దేవి, విద్యార్థుల పాలిట కల్పవల్లి, చదువే జీవితం అని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రజని అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహన్ని ఆమె బుధవారం ప్రతిష్ఠించారు. ఆమె మాట్లాడుతూ దైవభక్తితో క్రమశిక్ష అలవడుతుందన్నారు. జనసేన నాయకులు గంగులయ్య, ధనేశ్వరరావు, చిరంజీవి, హెచ్‌ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.